పరమేశ్వరం యిరుకున పడ్డట్టు ప్రవల్లికను చూసి "నాకేమీ అర్థం కావటంలేదు" అన్నాడు.

"నిజంగా అర్థం కావటంలేదా? 'నిజం' పిస్టల్ మార్పిడి ఎప్పుడు జరిగిందో?" రహస్యంగా, అతడికి మాత్రమే వినబడేట్టు అంది. అతడి మొహం ఎర్రరంగుకి మారింది. వర్ధనమ్మ ఇంకా కొడుకునీ, పద్మాకర్‌నీ తిడుతూనే వుంది. అయితే ఆమెలో అపాయం తప్పిన ఆనందం వల్ల వచ్చిన కృత్రిమ కోపం మాత్రమే ఉంది.

ప్రవల్లిక మాటలకి, ఏం జరిగిందో అర్థమయినట్లు- "ఇదంతా చేసింది నువ్వన్నమాట" అన్నాడు. పరమేశ్వరం పెదాలు బిగించి.

"అవును. ప్రవల్లిక అంటే 'పజిల్' అని అర్థం" సన్నగా నవ్విందామె.

"కంగ్రాచ్యులేషన్స్ ఇదంతా ఎలా కనుక్కున్నావు?"

"టెలిఫోన్ ట్రాప్‌చేసి వుంచాను అంతా బయటపడింది" అందామనుకుంది. పైకి చెప్పలేదు ఈ లోపులో అతడే-

"నన్ను నువ్వేం చెయలేవు. నీకే సాక్ష్యమూ లేదు" అన్నాడు తేలిగ్గా.

"కన్న కొడుకుని జైలుకి పంపాలనుకున్న రాక్షసుడివి. నీకు మా న్యాయస్థానాలు సరిపోవు. నరకమే సరి అయిన స్థానం. దానికి ఏ సాక్ష్యాలూ అవసరంలేదు."

"ఇదంతా నేను చేశానని నా కొడుక్కి చెపుతావా?... నమ్మడు."

"నమ్మడని తెలుసు అందుకే ఇప్పుడే చెప్పదల్చుకోలేదు దానికీ టైమ్ వస్తుంది."

"బెస్టాఫ్‌లక్."

అంతలో వర్ధనమ్మ ఇద్దరితో కలిసి దగ్గరగా వచ్చింది. "ఎంతలో ప్రమాదం తప్పిందండీ! అదేగానీ నిజం పిస్తోలు అయివుంటే ఏమయి వుండేది? ఇంతకీ నాటకాలు వద్దని ఇద్దరికీ చెప్పండి-" అంది.

"నీదంతా పిచ్చి అమ్మా! నాటకంలో నిజం పిస్టల్ ఎలా వస్తుంది?" అన్నాడు విహారి సర్ది చెపుతున్నట్టు.

"నా కదంతా తెలీదు. ఇంకీ నాటకాలు మానేస్తామని నా మీద ప్రమాణం చెయ్యి!"

ప్రవల్లిక పరమేశ్వరం వేపు ఓరగా చూసి "నాటకాలు మానెయ్యటం మంచిదే కదా. ఏమంటారు?" అంది. పరమేశ్వరం మాట్లాడలేదు.

"మేమేదో సరదాగా నాటకాన్ని కాస్త పొడిగిస్తే దానికింత భయపడతావేమిటమ్మా. ఏం నాన్నగారూ! మీరేమైనా భయపడ్డారా?"

పరమేశ్వరం బలవంతంగా నవ్వి "కాస్త భయపడ్డ మాట నిజమే అనుకో. కానీ ఇదంతా నాటకమని ముందే నాకూ తెలిసిపోయింది" అన్నాడు.

"మీ నాన్నగారు పెద్ద క్రిమినల్ లాయర్ కదా విహారీ! ఇలాంటి చిన్న చిన్న క్రైమ్స్‌కి

వేస్తేగానీ ఎవరూ పట్టుకోలేరు" అంది ప్రవల్లిక.

"నాకేం అర్థం కావటంలేదు."

"కొన్ని విషయాలు అర్థం కాకపోవటమే మంచిది."

పరమేశ్వరం ఇంకీ ప్రసక్తిచాలు అన్నట్టు "వెళదామా వర్ధనీ" అన్నాడు.

"నేను మేకప్ తుడుచుకుని తర్వాత వస్తాను" అన్నాడు విహారి.

"నేను కారు వరకూ వస్తాను పదండి.... " అంది ప్రవల్లిక.

"అవసరంలేదు. మేమెళ్తాం, శ్రమెందుకమ్మా నీకు" అన్నాడు పరమేశ్వరం.

"మీ వెనుకే రావటంలో శ్రమేం వుంది? పదండి?"

వర్దనమ్మ కొడుకుతో, "ఒరేయ్ తొందరగా ఇంటికిరా" అంది. వాళ్ళు వెళ్ళాక పద్మాకర్ విహారితో "అనవసరంగా ఈ నాటకం ఆడామేమో గురూ. మీ అమ్మ ఇక ఈ స్టేజీ వేపు రానిచ్చేలా లేదు" అన్నాడు.

"అటువంటిదేమీ వుండదులే-"

"మరి తొందరగా రమ్మంటుందేమిటి?"

"బహుశ దిష్టి తీయటానికి అయి వుంటుంది?"

ఇక్కడ ఈ సంభాషణ జరుగుతున్న సమయానికి అక్కడ పరమేశ్వరం భార్యతో కలిసి కారెక్కాడు. ప్రవల్లిక మర్యాదగా డోర్ వేసింది. "థాంక్స్" అన్నాడు.

ఇంత దానికేనా?

కాదు. నిజం పిస్టల్ సంగతి విహారికి చెప్పనందుకు.

అతని మటలు పూర్తి కాకుండానే కారు వేగంగా అక్కణ్నుంచి వెళ్ళిపోయింది. ప్రవల్లిక అలాగే నిలబడి వుంది. ఆమె మనసులో రకరకాల ఆలోచన్లు చోటుచేసుకున్నాయి. అదృష్టం బావుండబట్టి ఒకసారి విహారిని సేవ్ చేసుకోగలిగింది. ఈసారి పరమేశ్వరం ఇంత చిన్న ప్లాన్ వేయడు. మరెలా? కొడుకూ అతడూ ఒకే ఇంట్లో వుండేవారు. అతడు ఏం చెయ్యటానికయినా ఛాన్సులెక్కువ.

పోనీ విహారికి ఇదంతా చెప్పేస్తే?

అతని తండ్రి ఎంత దారుణమయిన ప్లాన్ వేసి అతనిని పధ్నాలుగు సంవత్సరాలు జైల్లో పెట్టటానికి ప్రయత్నించాడో విహారికి చెప్పేస్తే ..... ? అతడింత షాక్ భరించగలడా?

ఆమె ఎటూ నిర్ణయించుకోలేక పోయింది. ఆ ఆలోచనల సంధిగ్దంలోనే ఆమె పరమేశ్వరం నుంచి ట్రాప్ చేసిన టెలిఫోన్ సంభాషణలో ఒక వాక్యం మర్చిపోయింది ..... సునాదమాల చేతి వ్రాతతో పద్మాకర్ గదిలో కొన్ని లేఖలు పెట్టు అన్న వాక్యం అది. అలా అతడు ఎందుకు అనవలసి వచ్చిందా అని ఆమె ఆలోచించి వుంటే బావుండేది. స్నేహితుడ్ని రక్షించుకునే ప్రయత్నంలో ఆ ప్రేమలేఖల విషయానికి ప్రాముఖ్యత ఇవ్వకపోవటం మరో మలుపుకు

*　　　　　　　　　　*　　　　　　　　　　*

నేను మనస్తత్వ శాస్త్రజ్ఞుడ్ని కాకపోయి వుంటే, గొప్ప హస్త సాముద్రికుడ్ని అయి వుండేవాడిని అన్నాడు రాబర్టుసన్ అనే సైకాలజి ప్రొఫెసర్ రెండిటికీ అంత దగ్గర సంబంధం వుంది. పువ్వు పేరు చెబితేనో లేక ప్రశ్న అడిగిన టైము చెబితేనో భవిష్యత్తు చెప్పే ఒక జ్యోతిష్కుడ్ని ఒకసారి చూడటం జరిగింది. రాబర్ట్ సన్ సూక్తి ఎంతవరకూ నిజమోగాని సూడో జ్యోతిష్కుల (దొంగ సన్యాసుల) విషయంలో మాత్రం ఇది నూరుపాళ్ళు నిజం అనిపించింది.

చిన్నప్పుడు మీకు ఆక్సిడెంట్ జరిగింది? అనడానికి రెండు సమాధానాలు కాదు ..... అవును కాదంటే జాగ్రత్తగా గుర్తు తెచ్చుకోండి. మీరు మర్చిపోయి వుండవచ్చు అన్న సూచన ..... చిన్నప్పుడు అపెండిసైటిస్ ఆపరేషన్ జరింగిందండి చిన్న సంధిగ్దపు సమాధానం చాలు ..... అదే నేను చెప్పేది. ఆ ఆక్సిడెంట్‌లో ప్రాణం పోవాల్సింది అంటూ గర్వపు చిరునవ్వు ఇక అవునంటే చూశారా ఈ లైఫ్ లైన్ చూడగానే తెలిసిపోతోంది. అన్నట్టు మీరొక అమ్మాయిని ప్రేమించారు కానీ వివాహం జరగలేదు ..... దీనికి మళ్ళీ రెండు సమాధానాలు కాదు అవును. దాదాపు ప్రతీవాడు జీవితంలో  ఎవరో ఒకర్ని లవ్ చేసే ఉంటాడు. ఆ పెళ్ళి ఎలానూ జరిగి వుండదు. నూటికి తొంభయ్ మంది ఆ జ్ఞాపకాల్లోకి జారిపోయి తదాత్మ్యంగా అవును అంటారు లేదూ కాదంటే లేదా అయితే మీకు తెలియకుండానే మిమ్మల్ని ప్రేమించి గుండెల్లో నింపుకున్న అమ్మాయి ఎవరో వున్నారు ..... అవును ఇరవై ఏళ్ల క్రితం మా పక్కింట్లో ..... వద్దు చెప్పొద్దు ఈ హార్ట్ లైనే చెపుతోంది. మీరు ఆ ప్రేమని గుర్తించలేదు. పోన్లెండి అదీ మంచికే వచ్చింది. పోతే మీరు అప్పుడు ఏదో కష్టంలో వున్నారు చిన్న సమస్య.

ఇలా సాగుతుంది ఆ సంభాషణ. దీన్నే కొంచెం పెద్ద ఎత్తులో నిర్వహిస్తే .....

అనంతానంతస్వామికి బారులు తీర్చిన అనంతానంత భక్తకోటి మధ్య నడుస్తూ అక్కడక్కడ దీవెనలు ఇవ్వటం అలవాటు అప్పుడెప్పుడో అలా ఆగి ఒక భక్తురాలికి కుంకుమ ఇచ్చాడు. ఆమె నివ్వెరపోయి స్వామీ అంది. పక్కనున్న మరొకావిడ స్వామీ ఈమె పసుపు కుంకుమకి  నోచుకోలేదు అంది. తన సహజ గాంభీర్యంతో స్వామి నవ్వి మంచే జరుగుతుంది అని ముందుకు  సాగిపోయాడు. ఆవిడ అలాగే కుంకుమతో నిలబడిపోయింది.

ఆమె వర్ధనమ్మ.

ఆ రోజు జరిగిన సంఘటన ఈరోజు వర్ధనమ్మకి స్వామిమీద గౌరవాభిమానాల్ని విపరీతంగా పెంచేసింది తన నుదుటున బొట్టు నిలిపింది స్వామి రూపంలో భగవంతుడే అన్న నమ్మకం కలిగింది.

ఇందులో చిత్రమేమీ లేదు సి.బి.ఐ చీఫ్ అజ్ఞానం కన్నా ఇది పెద్దదేమీ కాదు. జరుగుతూన్న సంఘటనల్ని జ్యోతిష్కుడెప్పుడో చెప్పిన మాటలకి అన్వయించుకుని సంతృప్తి చెందటం (అలా జరగని వాటిని మర్చిపోవటం) సామాన్యుల అలవాటు.

ఆమె స్వామి మహిమకి అన్వయించుకుని తిరిగి మరొకసారి ఆయన్ని దర్శించాలనుకుంది. అయితే ఇసారి పరమేశ్వరం భార్యగా ఆమె హోదా వేరు భక్తుల దర్శన సమయంతో నిమిత్తం లేకుండా ఆ దంపతులకి స్వామి అంతఃపురంలోకి వెళ్ళే అవకాశం లభించింది.

విహారిని కూడా తీసుకువెళ్ళాం అన్నాడు పరమేశ్వరం.

విహారి మండిపడ్డాడు. నేను స్వామి దగ్గరికా? అన్నాడు కోపంగా

ఏం తప్పేముందిరా? అంది వర్ధన.

స్వామి ఏటువంటివాడో తల్లికి చెప్పటం అనవసరం అనిపించింది. నేను రాను అన్నాడు.

మనకెంతో సాయం చేసిన స్వామి గురించే నిర్లక్ష్యంగా మాట్లాడకు అన్నాడు పరమేశ్వరం విహారి కాస్త ఆలోచించి సరే అన్నాడు.

ఆ సాయంత్రం ముగ్గురూ స్వామి దగ్గరకి వెళ్ళారు. వర్ధనమ్మ భక్తిగా పూలూ ఫలాలూ సమర్పించింది. సామాన్యులకే కాదు, పెద్ద పెద్ద అధికారులకి కూడ దొరకని ఆ స్పెషల్ దర్శనం తనకి దొరకటం అదృష్టంగా భావించింది. అంతా తన భర్తకి ఉన్న పలుకుబడి అనుకుంది ఆమె జీవితంలో అంత ఆనందాన్ని ఇచ్చిన సంఘటనలు చాలా తక్కువ అసలామె జీవితంలో అంతా విషాదమే. తెలిసీ తెలియని వయసులో ప్రేమలో పడటం కోట్లు కాదని ప్రేమించినవాడితో వెళ్ళిపోవటం భర్త మరణం అన్నీ అటువంటి సంఘటనలే. ఇప్పుడు ఆమె జీవితంలో మాధుర్యాన్ని అనుభవిస్తూంది.

ఆ సంతోషంలో భక్తిగా స్వామి కాళ్ళకి నమస్కారం పెట్టింది. స్వామి నువ్వా అన్నట్టు తన కాళ్ళవైపు విహారి మొహం వైపు చూశాడు. వద్దని కొడుక్కి సైగ చేసింది. విహారి కాస్త తటపటాయించి స్వామికి ప్రణామం చేశాడు స్వామి చిరునవ్వుతో పరమేశ్వరం వైపు చూసాడు. పరమేశ్వరం గర్వంగా నవ్వేడు.

స్వామి తాయెత్తు తీశాడు ..... మండూక మహత్తు వున్న తాయెత్తు ఇది. సాధారణంగా ఎవరికీ ఇవ్వను. నా భక్తురాలి కొడుకువి కాబట్టి నీకు కడతాను అంటూ కట్టాడు వర్ధనమ్మ పొంగిపోయింది.

విహారి జేబులోంచి చిన్న పెట్టే తీశాడు. మార్జాల పూజచేసి భక్తిగా మీకు సమర్పించుకుందామని తెచ్చాను. భక్తుడి కానుకగ తీసుకోండి అని అన్నాడు వేలాది భక్తులు ఇచ్చిన కానుకలు గుట్టలు గుట్టలుగా పడివున్నాయి. స్వామి ఆ కానుక కూడా ఆ గుట్టలోకి జారవిడిచాడు.

మరోసారి నమస్కరించి తల్లీ కొడుకులు అక్కడనుంచి బయటకు వచ్చారు. వెనకే ఆగిన పరమేశ్వరం ఎందుకంత ఖరీదయిన మైక్రోఫోన్ అతడికి కట్టారు? అని అడిగాడు విహారి నుంచి తెలుసుకోవలసిన రహస్యాలు మనకి ఏమీలేవు కదా అని అతడి ఉద్దేశ్యం. స్వామి నవ్వేడు ..... నువ్వేమో సునాదమాల ..... ప్రేమలేఖలు ..... అంటున్నావు అక్కడ ప్రవల్లిక ఇతగాడిని ప్రేమిస్తున్నట్టు తోస్తోంది. అసలు విషయం ఏమిటో తెలుసుకుందామని ..... అన్నాడు.

పరమేశ్వరం తలూపి అక్కడనుండి వెళ్ళిపోయాడు.

అసలు విషయం నిజానికి అదికాదు.

స్వామికి అనుమానం వచ్చింది ఇన్నేళ్ళ కాలంలో పరమేశ్వరం వేసిన ప్లాన్ ఫెయిల్ అవటమన్నది ఇదే మొదటిసారి. కావాలంటే ప్రధానమంత్రి హత్యలో కూడా నేరస్థులు తప్పించుకునేలా ప్లాన్ చేయగల సమర్థుడు పరమేశ్వరం అటువంటిది ఇంత చిన్న విషయం అమలు జరపటానికి ఇన్ని రోజులు తీసుకోవటం, అందులోనూ విఫలమవటం స్వామికి అనుమానం రావటానికి కారణమైంది. కొడుకుతో కుమ్మక్కయి ఉండకపోవచ్చు కానీ బంధాలు పరమేశ్వరాన్ని తటపటాయించేలా చేస్తున్నాయేమో అని అనుమానం కలిగింది.

అది చాలు.

తన అనుచరుల్లో ఆ మాత్రపు క్రమశిక్షణా రాహిత్యాన్ని కూడ స్వామి సహించలేదు. తన అనుమానం ఎంతవరకూ నిజమో తెలుసుకోవటానికి విహారికి తాయెత్తు కట్టాడు.

అయితే ముద్రణాశాల నుంచి బయటకొచ్చిన రూపాయినోటు రకరకాలుగా జేబులు మారినట్టు ఈ తాయెత్తు రకరకాల మెడలు మారుతోందని అతడికి తెలీదు.

స్వామి అంత:పురం నుంచి బయటకొచ్చిన విహారి మొదట చేసినపని ఆ తాయెత్తుని సునాదమాల బామ్మకిచ్చి ఏం చెయ్యాలో చెప్పటం.

ఆ తరువాత బామ్మ తాయెత్తుని తీసుకెళ్ళి కాలేజీ నుంచి అప్పుడే ఇంటికొచ్చిన సునాదమాల మెళ్ళో బలవంతంగా వేయటం జరిగింది. ఏమిటి బామ్మా ఇదంతా? అంది చిరాగ్గా సునాదమాల.....

పురుష భయం నీలో పోవటానికి అద్భుతమైన తాయెత్తే ఎంతో భక్తితో సేవచేసి నీ కోసం తీసుకొచ్చాను. ఇది మెళ్ళో వేసుకుంటే ఏ పురుషునికీ నీ వైపు చూసే ధైర్యం ఉండదు.

సునాదమాల నమ్మలేనట్టు చూసింది. అవును నిజం అంటూ బామ్మ అయిదు నిమిషాలు కన్విన్స్ చేసింది. చివరకు మాల ఒప్పుకుంది.

నిజంగానే తాయెత్తు అద్భుతంగా పని చేసింది.